

ఈనాడు విజయనగరం

పరిపూర్ణ మానవుడే శ్రీరాముడు

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం: ధర్మాన్ని ఆశ్రయించి, స్వార్థాన్ని త్యజించి, ధార్మికుడిగా జీవితాన్ని గడిపిన పరిపూర్ణ మానవుడే శ్రీరాముడని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. రామనారాయణ ఆలయ ప్రాంగణంలో వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రాన్ని గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. నేడు దేశంలోని ప్రతి గ్రామం శ్రీరాముని ఆలయం, భజన మందిరాలతో శోభిల్లుతోందన్నారు. రాముడు ఒక వ్యక్తిగా, రాజుగా, తనయుడిగా, అన్నగా, భర్తగా.. ఇలా ఎక్కడా ధర్మం తప్పకుండా మహనీయుడుగా ఎదిగారని కొనియాడారు. భారతదేశం హిందూ దేశమని, హిందూ అనేది జీవన విధానమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ అనుసరిస్తే సుఖశాంతులు పొందే అవకాశం ఉందన్నారు.

ఆదర్శమార్గంలో పయనించాలి..

అంతా ఆదర్శ మార్గంలో పయనించే స్ఫూర్తి రావాలని ఆకాంక్షించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొంత మంది అనుసరిస్తున్న తప్పుడు విధానాలు సరి కాదన్నారు. సర్వధర్మ సమభావన కోరుకునే సంస్కృతి మనదన్నారు. మారిన కాలంలో స్వార్థం పెరిగిందని అశాంతి ప్రబలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణం ఆలయం నిర్మించిన నాటి నుంచి సుమారు కోటి మంది సందర్శించారని ట్రస్టీ నారాయణం నాగేశ్వరరావు తెలిపారు.


పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో రంగరాజన్ స్వామి, మాజీ ఎంపీ టీజీ.వెంకటేష్ తదితరులు

క్రమశిక్షణే ఉన్నతికి నిచ్చెన



ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ అవసరమని, అదే జీవితంలో ఉన్నతికి బాటలు వేస్తుందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. గురువారం ఆయన కోరుకొండ సైనిక పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ప్రిన్సిపల్ ఎస్.ఎస్.శాస్త్రి స్వాగతం పలికారు. తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మాతృభూమిని, మాతృభాషను గౌరవించాలని సూచించారు. కష్టమైనా ఇష్టపడి పనిచేయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం గ్రూప్ కెప్టెన్, ప్రిన్సిపల్ ఎస్.ఎన్. శాస్త్రితో కలిసి అన్ని విభాగాలను పరిశీలించారు. వైస్ ప్రిన్సిపల్, వింగ్ కమాండర్ వి.కిరణ్ పాల్గొన్నారు.

పాయల్ రాజ్‌పుత్ సందడి



విజయనగరంలో గురువారం ఓ మల్టీప్లెక్స్ థియేటర్ ప్రారంభానికి సినీ నటి పాయల్ రాజ్‌పుత్ హాజరై, సందడి చేశారు. ఆమెను చూసేందుకు యువత తరలివచ్చారు. 'విజయనగరం ప్రజలు బాగున్నారా..' అంటూ ఆమె ఆప్యాయంగా పలకరించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

సిరిమాను ఆగమనం రేపు

ఈ ఏడాది పైడితల్లి సిరిమాను, ఇరుసుమాను వృక్షాలను డెంకాడ మండలం పెదతాడివాడలోని మజ్జి అప్పారావు కల్లంలో గుర్తించారు. 28న ఉదయం 8 గంటలకు దేవస్థానం అధికారులు, పూజారి, తల్లి సేవకులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చెట్లకు గాట్లు పెట్టి భూదేవి నుంచి వేరు చేసే ప్రక్రియ చేపడతారు. అనంతరం పెదతాడివాడ నుంచి వనంగుడి, తర్వాత హుకుంపేటలోని పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసానికి తీసుకువస్తారు. అక్కడ పూజల అనంతరం వడ్రంగులు మానులను తీర్చిదిద్దనున్నారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్





నాతవలసలో లోకేశ్

తన పర్యటన ముగించుకుని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న మంత్రి నారా లోకేశ్ నాతవలస టోల్‌ప్లాజా వద్ద కాసేపు ఆగారు. అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిబ్బందితో ముచ్చటించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.
– న్యూస్‌టుడే, డెంకాడ



దివ్యాంగులకు పింఛను పండగ

నేరుగా ఖాతాల్లోకే నగదు

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

పింఛన్లు పొందే దివ్యాంగుల కష్టాలు ఎట్టకేలకు తొలగనున్నాయి. ఇన్నాళ్లూ నగదు పొందేందుకు ఇబ్బందులు పడేవారు. దూర ప్రాంతాల్లో ఉండేవారు ప్రత్యేకంగా వాహనాలతో స్వగ్రామాలకు చేరేవారు. వీరిలో విద్యార్థులు సైతం ఉన్నారు. గత అయిదేళ్లలో ఈ కష్టాలు తీవ్రమయ్యాయి. సకాలంలో రాలేనివారికి అప్పట్లో తెదేపా మూడు నెలలకోసారి సైతం అందించేది. వైకాపా వచ్చాక ఆ విధానాన్ని తొలగించింది. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు వేయాలని నిర్ణయించింది. నవంబరు నుంచి అమల్లోకి తెస్తున్నట్లు పేర్కొంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 4.3 లక్షల మంది పింఛనుదారులున్నారు. వీరిలో వివిధ విభాగాలకు సంబంధించి 49,622 మంది దివ్యాంగులు నగదు పొందుతున్నారు. వీరిలో చాలా మంది పనుల నిమిత్తం ఇతర గ్రామాల్లో ఉంటున్నారు. కొందరు దూర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. ఇంకొందరు విద్యార్థులు వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్నారు. ప్రతినెలా వీరు స్వగ్రామాలకు చేరుకుని పింఛను పొందుతున్నారు. ఇకనుంచి నేరుగా ఖాతాల్లోకి వేయనున్న నేపథ్యంలో ఇలాంటి వారు ఎంతమంది ఉన్నారో లెక్క తేల్చనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆ జాబితాను సిద్ధం చేస్తోంది.

మార్చుకునే సౌలభ్యం..

ఏ విభాగం లబ్ధిదారులైన సొంత గ్రామానికి వెళ్లి పింఛను తీసుకోవాల్సిన అవసరం లేదని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ ప్రాంతంలో ఉంటే అక్కడి సచివాలయానికి మార్పు చేసుకునే అవకాశం కల్పించింది. అందుకు గానూ ప్రస్తుతం ఏ సచివాలయం పరిధిలో ఉన్నారో ఆ వివరాలతో కూడిన దరఖాస్తును అధికారులకు అందించాలి. నెలలో 5వ తేదీ నుంచి 16వ తేదీలోగా ఇవ్వాలి. ఏ సచివాలయానికి మార్చుకోవాలో ఆ చిరునామా పొందుపర్చాలి. అనంతరం సిబ్బంది పరిశీలించి, అక్కడికి బదిలీ చేస్తారు. ఈక్రమంలో ఆ తరువాత నెలలో ఉన్నచోటే నగదు పొందవచ్చు.

గుర్తింపు ప్రక్రియను ప్రారంభించాం..

ఇతర ప్రాంతాలు, వసతిగృహాల్లో ఉంటున్న దివ్యాంగ లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నాం. ఈమేరకు సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం ఇచ్చిన వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తాం. అనంతరం నేరుగా డీబీటీ ద్వారా ఖాతాల్లో నగదు జమకానుంది. సచివాలయ పరిధిని కూడా మార్చుకోవచ్చు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ప్రతినెల 50 నుంచి 80 మంది వరకు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ విధానం ఎంతో మేలు. – కల్యాణ్ చక్రవర్తి, డీఆర్డీఏ పీడీ

బదిలీలు సరే.. ఉత్తర్వులేవీ?



డీఆర్వో కార్యాలయం వద్ద వీఆర్వోలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ విభాగంలో పెద్ద సంఖ్యలో బదిలీలు జరిగాయి. కొన్ని రోజులుగా గోప్యత పాటించిన అధికారులు మంగళవారం రాత్రి వివిధ కేడర్లలో 462 మందికి స్థానచలనం కల్పించినట్లు అధికారికంగా వెల్లడించారు. గ్రేడ్‌-1 వీఆర్వోలకు సంబంధించి ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇంకా ఉత్తర్వులు ఇంకా ఇవ్వలేదని తెలుస్తోంది. గురువారం వివిధ మండలాల నుంచి వారంతా కలెక్టరేట్‌కు వచ్చారు. ఉమ్మడి జిల్లాలో 238 మందిని ఇతర ప్రాంతాలకు పంపించాల్సి ఉంది. ఉత్తర్వులేకపోవడంతో పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ఎవరిని ఎక్కడికి పంపించారో తెలియడం లేదని, అధికారులను కోరేందుకు వచ్చినట్లు తెలిపారు. ఉత్తర్వులు సిద్ధం చేస్తున్నామని డీఆర్వో అనిత తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి అధికారిగా ప్రశాంత్‌కుమార్



కలెక్టర్‌ను కలిసిన ప్రశాంత్‌కుమార్

విజయనగరం ఉడాకాలనీ, మయూరి కూడలి, న్యూస్‌టుడే: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా జి.ప్రశాంత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకుముందు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న గోవిందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

రెవెన్యూలో మార్పులు

డెంకాడ, బొబ్బిలి, న్యూస్‌టుడే: జిల్లాలోని పలువురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం ఆర్డీవోగా వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తిని నియమించారు. సూర్యకళను జేడీలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. డెంకాడ తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు రెవెన్యూ ఉద్యోగులకు స్థానచలనమైనట్లు తహసీల్దారు పద్మావతి తెలిపారు. ఇక్కడ డీటీగా పనిచేసిన సూర్యకాంతాన్ని పీఎఫ్‌పురం డీటీగా, ఆర్ఐ అనూషను కలెక్టరేట్‌లోని ఎ-2 సెక్షన్‌లో, జూనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న సురేష్‌ను భోగాపురం తహసీల్దారు కార్యాలయంలో నియమించనున్నారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన గాంధీ డెంకాడ డీటీగా, కలెక్టరేట్‌లో పరిపాలనా విభాగంలో ఉన్న కిరణ్ ఆర్ఐగా, భోగాపురం నుంచి ప్రసాద్ రావురై డీటీగా, గుర్లలో పనిచేసిన డీటీ శంకర్ డెంకాడ, నెల్లిమర్ల సీఎస్‌డీటీగా వెళ్లనున్నారు.

టిడ్కో ఈఈగా రమణమూర్తి..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాల టిడ్కో ఈఈగా పనిచేస్తున్న పి.జ్యోతిని డివిజన్ విజయనగరం ప్రజారోగ్య విభాగం ఈఈగా రానున్నారు. ఇక్కడ ఈఈగా ఉన్న కె.దక్షిణామూర్తి శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ఈఈగా వెళ్లనున్నారు. ★ డీవీ.రమణమూర్తిని ఏపీ టిడ్కో విజయనగరం ఈఈగా నియమించారు ★ విజయనగరం నగరపాలక సంస్థలో సర్వేయరుగా విధులు నిర్వహిస్తున్న రెడ్డి సింహాచలాన్ని గంట్యాడ బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న అప్పలస్వామిని కలెక్టరేట్‌కు పంపించారు.

వసతిగృహాలకు రూ.9 కోట్ల నిధులు

శృంగవరపుకోట: ఎస్.కోటలోని అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహ భవన నిర్మాణానికి ప్రధానమంత్రి అజయ్ పథకం కింద రూ.3 కోట్లు మంజూరైనట్లు సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామానందం తెలిపారు. ఆయన గురువారం ‘న్యూస్‌టుడే’తో మాట్లాడారు. జిల్లాలోని ఎస్.కోటతో పాటు విజయనగరం, గజపతినగరంలోని వసతిగృహాలకు రూ.3 కోట్ల చొప్పున నిధులొచ్చాయన్నారు. ఎస్.కోటలో గతంలో ఉన్న ప్రీమెట్రిక్ వసతిగృహం స్థలంలో కొత్తగా కళాశాల వసతి భవనాన్ని నిర్మిస్తామన్నారు. తెర్లాం, బాడంగి, విజయనగరం, ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలిలో సాంఘిక సంక్షేమ గృహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

కేజీబీవీల్లో మహిళలకు అవకాశం

ఉమ్మడి జిల్లాలో 82 పోస్టుల భర్తీకి చర్యలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో(కేజీబీవీలు) మహిళా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు ప్రకటన వెలువడింది. ఏడు కేడర్లలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతరులను పొరుగుసేవల విధానంలో(ఒక సంవత్సర కాలానికి) తీసుకోనున్నారు. ఈమేరకు దరఖాస్తులు ఆహ్వానించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 82 పోస్టులకు అవకాశం ఉంది.

ప్రారంభమైన నమోదు..

ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 26 నుంచి అక్టోబరు పదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఓపెన్ కేటగిరీకి సంబంధించి 18- 42 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విభాగాల వారికి 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3, దివ్యాంగులకు పది సంవత్సరాల మేర వయో పరిమితిలో మినహాయింపు కల్పించారు. ఇతర వివరాలను apkgvb.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో ప్రేమకుమార్ గురువారం ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

భర్తీ చేయనున్న పోస్టులు ఇలా..

పేరు	విజయనగరం	మన్యం
ప్రధానాచారిణి	-	01
పీజీటీ	15	07
సీఆర్టీ	08	16
పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్	15	07
వార్డెన్	04	03
అకౌంటెంట్	06	-

లారీ ఢీకొని వృద్ధుడి మృత్యువాత

తెర్లాం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన తెర్లాం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్‌బాబు వివరాల మేరకు.. తెర్లాం గ్రామానికి చెందిన వి.భీమయ్య(68) బుధవారం కాలనీ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



వెంకటరమణ (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రేగిడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు బాలకవిలస గ్రామానికి చెందిన కె.వెంకటరమణ(38) వాహన చోదకుడిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం గ్రామ శివారున పురుగు మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన చేరుకుని రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గౌరునాయుడు తెలిపారు.

ఉత్తరావిల్లి రోడ్డు.. ఊడిపోయింది



ఉత్తరావిల్లి సమీపంలో భారీ గుంతలు



దారిపొడవునా ఇదే పరిస్థితి

తెర్లాం మండలంలోని ఉత్తరావిల్లి ఆర్‌అండ్‌బీ రహదారిపై వర్షానికి గోతులు మరింత పెద్దవయ్యాయి. ఇటీవల లారీలు కూరుకుపోవడంతో బుదరాయవలస పోలీసులు కొన్ని చోట్ల మట్టితో పూడ్చారు. మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. పారాది వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో భారీ వాహనాలన్నీ ఉత్తరావిల్లి, తెర్లాం మీదుగా బొబ్బిలి వైపు వెళ్తున్నాయి. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చోదకులు వాపోతున్నారు. రహదారి అభివృద్ధికి నిధులు కోరుతూ ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే బాగు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ రాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, తెర్లాం

సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి: ఎస్పీ



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాల నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి అని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించారు. కెమెరాల పరితీరుపై ఆరా తీశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న కెమెరాలు, వాటి వినియోగం తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్బీ సీఐ ఏవీ.లీలారావు తదితరులు పాల్గొన్నారు.

నేరవార్తావిభాగం: గుండె పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి గురువారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. హృద్రోగ సమస్యలతో ఇబ్బంది పడేవారికి సీపీఆర్‌తో పునర్జన్మ ఇవ్వొచ్చన్నారు.

అవినీతిని వెలికి తీస్తాం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖలో జరుగుతున్న అవినీతిని వెలికి తీస్తామని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడు గద్దె బాబూరావు అన్నారు. చీపురుపల్లిలో గురువారం మాట్లాడారు. వైకాపా హయాంలో రేషన్ పంపిణీకి 9,260 వాహనాలను కొనుగోలు చేసి, ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. వాటితో ప్రజలకు అవస్థలు తప్ప ఉపయోగం ఏమీ లేదన్నారు. కార్డుదారులకు సరఫరా చేస్తున్న బియ్యం కొందరు అక్రమార్కులు రీ సైక్లింగ్ చేస్తున్నారన్నారు. గడచిన అయిదేళ్లలో రైతుల నుంచి ధాన్యం విక్రయాల్లో కొంత మంది మిల్లర్లు భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు.

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

నాగావళి ఉరకలు



అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నాగావళి నదిలో ప్రవాహం పెరిగింది. గురువారం నదిలోకి 13,500 క్యూసెక్కులకుపైగా నీరు వచ్చిందని ఏఈ జీవీ రమణ అన్నారు. నారాయణపురం ఆనకట్టపై ఉన్న కుడి, ఎడమ ప్రధాన కాలువలకు 1,300 క్యూసెక్కులు నీరు విడుదల చేశామని తెలిపారు. - న్యూస్‌టుడే, సంతకవిటి

జాతీయ పోటీలకు ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: గరికివలస ఉన్నత పాఠశాలకు చెందిన ఎమ్. ధనలక్ష్మి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.మల్లికార్జునరావు తెలిపారు. ఈనెల 28 నుంచి ఝార్ఖండ్‌లో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి, గ్రామపెద్దలు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? గరివిడి రైల్వే వంతెన పక్క నుంచి గర్భాం వెళ్లే రహదారి గోతులను కంకరతో పూడ్చడంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి రేగుతూ ఇళ్లలోకి వస్తుంది. **- వీవీఎస్ఎస్ఎన్ గుప్త, గరివిడి**

● త్వరలో పరిశీలించి, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- మూర్తి, ర.భ.శాఖ ఏఈ** – న్యూస్‌టుడే, గరివిడి

? లక్కిడాం ప్రధాన వీధిలో చేరిన మురుగుతో అవస్థలు పడుతున్నాం. **- స్థానికులు**

● రహదారిపైకి మురుగు నీరు రాకుండా చర్యలు చేపడతాం. **- భానోజీరావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

విరాళాలు అందజేత



రూ.50వేలు ఎమ్మెల్యే బేబినాయనకు అందజేస్తున్న గజరాయునివలస గ్రామస్థులు

బొబ్బిలి, గ్రామీణం, బాడంగి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు దాతలు నగదు, చెక్కులను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. బాడంగి మండలం గజరాయునివలస తెదేపా నాయకులు, కార్యకర్తలు రూ.50వేలు, పింద్రంగివలస నాయకులు రూ.15వేలు, బొబ్బిలి మండలం కొండదేవుపల్లి సర్పంచి బి.వెంకటరమణ రూ.20వేలు, సి.సత్యనారాయణ రూ.5వేలు, కె.సత్యనారాయణ రూ.5వేలు, శివడవలస గ్రామం తరపున సి.రామస్వామినాయుడు రూ.22వేలు, రాముడువలస కార్యకర్తలు రూ.24 వేలు, సర్పంచి ఎం.సీతంనాయుడు రూ.10వేలు, ఎ.కిశోర్ రూ.5,500, గ్రామ యువత రూ.6వేలు అందజేశారు. రెడ్డియ్యవలస తెదేపా నాయకులు రూ.21,121, జి.వి.నాయుడు రూ.5వేలు, ఆర్.సింహాచలం రూ.5వేలు, గ్రామ యువత, కార్యకర్తలు రూ.11,121, బొబ్బిలి పట్టణ కళాసీ సంఘం తరపున రూ.30వేలు, అలజంగి కార్యకర్తలు రూ.21,100 అందజేశారు. శివడవలస గ్రామస్థుల తరపున రామస్వామి రూ.22వేలు, కొండదేవుపల్లి నాయకుడు వెంకటరమణ రూ.20వేలు, సత్యనారాయణ రూ.5వేలు అందించారు.

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

అధ్వాన రహదారులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది..వీటి మరమ్మతులకు అత్యవసర నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో కొత్త రహదారులకు నిధులు ఇవ్వలేదు సరికదా కనీసం మరమ్మతులను కూడా పట్టించుకోలేదు. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటన మేరకు రోడ్లు భవనాల శాఖ పరిధిలో పలు రహదారులకు నిధులు విడుదల చేస్తూ అధికారులకు ఉత్తర్వులు అందాయి. గత ఐదేళ్లలో ఏటా మంజూరు చేయాల్సిన నిర్వహణ నిధులను కూడా ఇవ్వకుండా చేశారు. దీంతో గోతుల పూడ్చివేత, తుప్పల తొలగింపు చేయని పరిస్థితి.



నారసింహునిపేట వద్ద పాడైపోయిన మార్గం

తరచూ ప్రమాదాలు

నియోజకవర్గంలో రహదారులు గోతులమయంగా మారి, గత ఐదేళ్లలో అనేక మంది ప్రమాదాల బారినపడ్డారు. బొబ్బిలి మండలం గొర్లెసీతారాంపురం వద్ద గోతుల్లో రెండుసార్లు పశువులతో వెళ్తున్న వాహనాలు బోల్తాపడి మూగజీవులు మృత్యువాతపడ్డాయి. మల్లంపేటకు చెందిన ఓ యువకుడు ఇదేచోట గోతులు తప్పించే క్రమంలో బోల్తాపడి దుర్మరణం చెందాడు. ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఓ మహిళా ఉపాధ్యాయిని ఏడాదిన్నర క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గోతుల్లో దిగడంతో అదుపుతప్పి, తీవ్రంగా గాయపడింది. కోమటిపల్లి సమీపంలో ఇటీవల రహదారి మధ్యలో గొయ్యిని తప్పించబోయి సాలూరుకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. తెదేపా, సీపీఎం, సీపీఐ నాయకులు, స్థానికులు పలుమార్లు ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇక సాఫీగా ప్రయాణం

రహదారుల మరమ్మతులకు అత్యవసర నిధులు విడుదల

టెండర్లకు కసరత్తు

బొబ్బిలి నియోజకవర్గంలో 9 అత్యవసర పనుల నిమిత్తం రూ.1,47,60,000 కేటాయించారు. వీటికి టెండర్లు పిలిచి పనులు చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ● చిలకపాలెం రహదారి నుంచి రామభద్రపురం మండలం ఆకుల కట్ట కూడలి, తెర్లాం మండలం పనుకువలస, రేజేరు రహదారిపై ఏర్పడ్డ గోతుల్ని పూడ్చేందుకు రూ.5 లక్షలు విడుదల చేశారు. ● రామభద్రపురం నుంచి బొబ్బిలి మండలం గొర్లె సీతారాంపురం రహదారి మరమ్మతులకు రూ.3 లక్షలు, బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి పైపుల తయారీ కేంద్రం వరకు, బొబ్బిలి-బలిజిపేట రహదారికి మరమ్మతులకు రూ.8.10 లక్షలు మంజూరు చేశారు. ● బాడంగి మండలం డొంకినవలస రైల్వే స్టేషన్ నుంచి ప్రధాన రహదారి మరమ్మతులకు రూ.15 లక్షలు ● చిలకపాలెం రహదారి నుంచి ఉత్తరావల్లి కూడలి నుంచి రామభద్రపురం, బొబ్బిలి-తెర్లాం రహదారికి రూ.45 లక్షలు ● రామభద్రపురం మండలం బూసాయవలస, కోటశిర్లాం రహదారి మరమ్మతులకు రూ.46 లక్షలు ● రామభద్రపురం ప్రధాన మార్గానికి రూ.14 లక్షలు ● తెర్లాం మండలం నెమలాం, గళావల్లి దారికి రూ.3.5 లక్షలు ● పాతబొబ్బిలి నుంచి నారసింహునిపేట, చింతాడ-పక్కి రోడ్లకు రూ.8 లక్షలు కేటాయించారు.

దెబ్బతిన్న చోట్ల పనులు

అత్యవసర పనులకు నిధులు మంజూరు అయ్యాయి. ఆయా పనులకు టెండర్లు పిలిచి ఖరారు కాగానే ప్రారంభిస్తాం. రహదారులు ఎక్కడెక్కడ పాడయ్యాయో అక్కడే మరమ్మతు చేస్తాం.

– రాజు, ఏఈ

రూ.25 కోట్లతో గ్రామాభివృద్ధి

రామభద్రపురం, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల్లో రూ.25 కోట్లతో సీసీ రహదారులు, కాలువలు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం తెదేపా నాయకుడు ఎల్.అప్పన్న, ఎం.స్వామినాయుడు, సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సభలో మాట్లాడారు. నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. బొబ్బిలి మండలం కొండదేవుపల్లిలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. బేబినాయన గ్రామంలో పర్యటించి, కరపత్రాలు అందించారు. గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయకుండా వైకాపా నిర్లక్ష్యం చూపిందన్నారు. ఎత్తిపోతల పథకం పూర్తిచేసి కమ్మవలస, కొండదేవుపల్లి, శివడవలస, ముత్తాయవలస గ్రామాలకు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు.

అయిదు తరగతుల్లో తొమ్మిది మందేనా..!



విద్యార్థినిని ప్రశ్నిస్తున్న డీడీ నిర్మలాకుమారి

రాజాం, న్యూస్‌టుడే: నందబలగ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి అయిదు తరగతుల్లో తొమ్మిది మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో జిల్లా మత్స్యశాఖ డీడీ, ప్రత్యేకాధికారిణి నిర్మలాకుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. నందబలగ, లక్ష్మీపురంలో గురువారం గ్రామ సందర్శన నిర్వహించారు. అన్ని వసతులున్నా.. విద్యార్థుల సంఖ్యను పెంచలేకపోతున్నారన్నారు. లక్ష్మీపురం పాఠశాలలో 23 మంది విద్యార్థులున్నట్లు గుర్తించారు. తహసీల్దారు కృష్ణంరాజు, ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకారాగారం పరిశీలన

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ఉప కారాగారాన్ని జిల్లా న్యాయమూర్తి బి.కల్యాణ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా కార్యదర్శి కె.విజయలక్ష్మి, స్థానిక సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ గురువారం సందర్శించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడారు. వారి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం ఎలా పొందొచ్చు తదితర అంశాల్ని వివరించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రసన్నకుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



సౌకర్యాలపై ఆరా తీస్తున్న కల్యాణ చక్రవర్తి, న్యాయమూర్తులు

కాజ్‌వేపై రాకపోకలు పునరుద్ధరణ



బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పారాది వద్ద వేగావతి నదిపై ఉన్న కాజ్‌వే మీదుగా నీరు ప్రవహించడంతో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇతర మార్గాల మీదుగా పోలీసులు భారీ వాహనాలను మళ్లించారు. నీరు తగ్గిన తర్వాత మళ్లీ మరమ్మతులు చేసి, గురువారం మధ్యాహ్నం నుంచి రాకపోకలను పునరుద్ధరించారు. ఎగువన కొండ ప్రాంతాల్లో వర్షం పడినప్పుడల్లా వరద పెరుగుతోంది. మరమ్మతులు చేసిన తరువాత వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చామని ఏఈ రాజు తెలిపారు.

పెనుబర్తిలో విష జ్వరాలు

గుర్ల, న్యూస్‌టుడే: పెనుబర్తిలో విషజ్వరాలు విజృంభించాయి. గ్రామానికి చెందిన ఆర్.హైమావతి, జి.సత్యవతితోపాటు మరో మూడేళ్ల బాబు డయేరియా లక్షణాలతో విజయనగరం, చీపురుపల్లిలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారులు ఇంటింటా సర్వే చేపట్టి పెనుబర్తిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి పెంటోజీరావు, తహసీల్దారు పద్మావతి, ఈవోపీఆర్డీ గాయత్రి గ్రామంలో పర్యటించారు. క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి తదితరులు

చెత్త ఊడ్చి.. సున్నం వేసి..



గోడకు సున్నం వేస్తున్న బేబీనాయన

బొబ్బిలి: యుద్ధస్తంభం పార్కు వద్ద పురపాలిక ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు సుమారు 200 మంది పాల్గొని శ్రమదానం చేశారు. ఎమ్మెల్యే బేబీనాయన గోడలకు సున్నాలు వేసి, చీపురుతో శుభ్రం చేశారు. ఉద్యోగులు బెంచీలకు రంగులు వేశారు. పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, చెప్పులు, బూట్లు పంపిణీ చేశారు. విజయవాడలో పారిశుద్ధ్య పనులకు వెళ్లిన పలువురు కార్మికులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో దుస్తులు కొనుగోలు చేసి అందజేశారు. కమిషనర్ రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆర్డీవోల బదిలీ

బొబ్బిలి, న్యూస్‌టుడే: జిల్లాలోని పలువురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ ఏపీఐఐసీ ప్రత్యేక భూసేకరణ ఉప కలెక్టరు జీవీ సత్యవాణిని చీపురుపల్లి ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.శాంతిని జీఏడీలో రిపోర్టు చేయాలని సూచించారు. బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ జమ్మలమడుగు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం వంశధార ప్రత్యేక ఉపకలెక్టరు జి.వెంకట సత్యసాయి రామమోహనరావును బొబ్బిలి ఆర్డీవోగా నియమించారు. అదేవిధంగా బొబ్బిలి నీటిపారుదల సర్కిల్ పరిధిలోని పార్వతీపురం ఇరిగేషన్ డివిజన్ ఈఈ అప్పలనాయుడును శ్రీకాకుళం ఇరిగేషన్ డివిజన్‌కు బదిలీ చేశారు.

మట్టి దిబ్బలు తీసేందుకు చర్యలు

వంగర, న్యూస్‌టుడే: సువర్ణముఖి నదిలో పేరుకుపోయిన మట్టి దిబ్బలను త్వరితగతిన తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జేసీ సేధు మాధవన్ తెలిపారు. గురువారం కొండ చాకరాపల్లి గ్రామ సమీపంలోని నది తీరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామం చుట్టూ రక్షణ గోడ నిర్మించి, వరద నుంచి కాపాడాలని స్థానికులు కోరారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని జేసీ అన్నారు. కార్యక్రమంలో గనులశాఖ ఆర్ఐ శ్యామ్‌పీటార్, తహసీల్దార్ ధర్మరాజు, నీటిపారుదలశాఖ అధికారులు రవికుమార్, నీతీన్‌కుమార్, రాజేష్ తదితరులు ఉన్నారు.



అధికారులతో చర్చిస్తున్న జేసీ సేధు మాధవన్

యువత.. మీ చేతిలోనే భవిత



సంతకవిటిలో సూచనలిస్తున్న ఎస్ఐ గోపాలరావు

రాజాం, సంతకవిటి, గుర్ల, గజపతినగరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని, కన్న వారి కలలను చిదిమేయొద్దని సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. రాజాం పట్టణంలోని ఆదిత్య కళాశాలలో విద్యార్థులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాదక ద్రవ్యాలపై సమాచారం ఇచ్చేందుకు సంతకవిటి మండలం పరిధిలోని అన్ని కళాశాలల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. దీనిపై జూ.కళాశాలలో ప్రిన్సిపల్ షణ్ముఖరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్లలో సీఐ జి.శంకరరావు, ఎస్ఐ పి.నారాయణరావు, గజపతినగరం శ్రీభవిష్య కళాశాలలో ఎస్ఐ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో మత్తు నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పని ఒత్తిడితో పిల్లల్ని దూరం చేయొద్దు

గంట్యాడ, న్యూస్‌టుడే: పని ఒత్తిడిలో పడి తల్లిదండ్రులు పిల్లలకు దూరం కావొద్దని, రోజూ వారితో కొంతసమయం గడపాలని గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్ఎస్‌వీ జగన్నాథరావు, ఎస్ఐ సాయికృష్ణ అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనించాలని, తప్పు జరుగుతున్నట్లు అనుమానం వస్తే అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. పిల్లలు బెట్టింగు, ధూమపానం, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండేలా కన్నవారు చూసుకోవాలని చెప్పారు.



హాజరైన తల్లిదండ్రులు

క్రమశిక్షణ లోపిస్తే ఉపేక్షించం

బొబ్బిలి, న్యూస్‌టుడే: క్రమశిక్షణ లోపిస్తే చర్యలు తప్పవని ఉప విద్యాశాఖాధికారి కె.మోహనరావు హెచ్చరించారు. పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో బోధనా సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఆయన, ఎంఈవోలు లక్ష్మణరావు, వాసు పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. గురువారం విద్యార్థినులతో వేర్వేరుగా మాట్లాడామని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను కూడా వివరాలు అడిగినట్లు తెలిపారు. ఆరోపణలే తప్ప ఎలాంటి ఫిర్యాదు పాఠశాల నుంచి లేదన్నారు. అయినప్పటికీ సిబ్బందిని హెచ్చరించామని తెలిపారు. పాఠశాల ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శతశాతం పూర్తికి చర్యలు



దస్త్రాల్ని పరిశీలిస్తున్న రవీంద్రకుమార్

బొండపల్లి, న్యూస్‌టుడే: బీసీజీ టీకాలు శతశాతం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సహాయ ప్రాజెక్టు అధికారి రవీంద్రకుమార్ అన్నారు. గురువారం గొట్లాం గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందిస్తున్న సేవల్ని, దస్త్రాల్ని పరిశీలించారు. టీబీ ఉన్న వారికి పరీక్షలు చేయాలన్నారు. జిల్లా క్షయ నివారణ సమన్వయాధికారి రాము, ఆరోగ్య కార్యకర్త విశ్వేశ్వరరావు ఉన్నారు.

మెగా రక్తదాన శిబిరం



పాల్గొన్న యువత

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి అభ్యుదయ విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 105 యూనిట్లు సేకరించినట్లు ప్రిన్సిపల్ చింత శారద, కరస్పాండెంటు కూర్మినాయుడు(నాని) తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చల్లా చల్లంనాయుడు అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో విద్యుత్తు లోఓల్టేజీ సమస్యలు ఉన్నాయని కొందరు సభ్యులు అన్నారు. పరిశీలిస్తామని ఏఈ శంకరరావు తెలిపారు. తహసీల్దారు డి.రాజేశ్వరరావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు ఆర్.సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

విజన్-2047పై అవగాహన



దస్త్రాలు పరిశీలిస్తున్న రామారావు

తెర్లాం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047పై ప్రత్యేక దృష్టి సారించిందని, దీనికి అందరూ సహకరించాలని ప్రత్యేకాధికారి వీటీ రామారావు అన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా కూనాయవలస, జన్నివలసలో పర్యటించారు. సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనివ్వాలని, సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. అంగన్‌వాడీ, ప్రాథమికోన్నత పాఠశాల, ఆరోగ్య, రైతుసేవా కేంద్రాల్ని పరిశీలించారు. ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తహసీల్దారు జి.హేమంత్ కుమార్, ఎంఈవో జె.త్రినాథరావు, ఏవో సునీల్ ఉన్నారు.

ఘనంగా వారాల పండగ

బొండపల్లి, న్యూస్‌టుడే: వారాల పండగ సందర్భంగా గురువారం గునాలమ్మ వేడుకను నిర్వహించారు. దేవుపల్లి గ్రామంలో డప్పు వాయిద్యాలు, కర్ర సాము, కోలాటం తదితర ప్రదర్శనలు చేపట్టారు. అమ్మవారికి పూజలు చేశారు.



హమాలీల ఆందోళన

బొబ్బిలి, న్యూస్‌టుడే: పౌరసరఫరాల గోదాంలో పనిచేస్తున్న తమ పాత బకాయిలు చెల్లించాలంటూ హమాలీలు స్థానిక గోదాం వద్ద ఆందోళన చేపట్టారు. హమాలీ సంఘ జట్టు మేస్త్రీలు పి.గోపి, ఎం.నరసింహులు తదితరులు ఉన్నారు.

బేబినాయన సొంత నిధులతో బోరు

తెర్లాం: గోపాలవలస శ్మశానవాటికలో నీళ్ల బోరు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రెండు నెలల కిందట ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి గ్రామస్థులు తీసుకువెళ్లారు. ఆయన సొంత నిధులతో గురువారం శ్మశానవాటికలో బోరు తవ్వించారు.

సంక్షిప్త సమాచారం

ఇబ్బందుల్ని విస్మరిస్తున్నారు

గజపతినగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను విస్మరిస్తున్నాయని, పెత్తందార్లకు కొమ్ము కాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ అన్నారు. నవంబరులో నిర్వహించనున్న జిల్లా మహాసభల గోడపత్రికను విడుదల చేశారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గజపతినగరం: చంపావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పాత శ్రీరంగరాజపురం వద్ద మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ● మెంటాడ: జక్కువలో ఓ కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీతారాం తెలిపారు. 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పిచికారీ యంత్రాలు పంపిణీ



గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధే 'మురపాక గ్రామాభివృద్ధి సంఘం' లక్ష్యమని ఆ సంఘం సభ్యుడు కరక వెంకటరమణ అన్నారు. గ్రామంలో పలువురు రైతులకు మందులు పిచికారీ చేసే స్ప్రేయర్లను ఉచితంగా పంపిణీ చేశారు.

28న వేలం

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి సీహెచ్‌సీలో పాత మంచాలు, కుర్చీలు, తుప్పుపట్టిన వస్తువులు అధికంగా ఉన్నాయని, వీటిని ఈనెల 28న ఉదయం ఆసుపత్రి ఆవరణలో వేలం వేయనున్నామని సూపరింటెండెంటు పి.నాగేశ్వరరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

మాజీ మంత్రికి పరామర్శ

గజపతినగరం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు పడాల అరుణ కుమారుడు శరత్ చంద్ర మరణంపై పలువురు నేతలు విచారం వ్యక్తం చేశారు. జనసేన పార్టీకి చెందిన అనకాపల్లి ఎమ్మెల్యే కె.రామకృష్ణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, రాష్ట్ర పౌరసరఫరాల కమిటీ సభ్యుడు ఆర్పీ భంజ్‌దేవ్ తదితరులు గురువారం ఆమెను పరామర్శించారు.



వేలం ప్రకటన

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM

E.P. No:131/2017 in O.S. No: 228/2015

Between:

Viswanadhula Dayananda Raju ....DHR

And

Kolla Satteyya Gupta ....JDR

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై నెంబరు అమలు పిటిషన్లో, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి, పై కోర్టు వారు తే. 15-10-2024 ది ఉదయం గం॥ 10.30 ని॥ లగాయతు, సాయంత్రం గం॥ 5.00 లోగా, కోర్టులో వేలం వేయబడును. కావున ఆసక్తి గల వారు వేలంలో పాడుకొనవచ్చును.

వేలం ఆస్తి వివరం: Vizianagaram Dist., Gajapathinagaram Mandal, Madhupada Village, Zeroyathi dry land and Agriculture lands measuring an extent Ac. 4.75 Cents, covered by Sy. No's: 35/2, Ac.1.71 Cents, 35/12, Ac.0.12 Cents, 35/4, Ac.0.62 Cents, 35/8, Ac.0.52 Cents, 35/15, Ac.1.78 Cents.

Boundaries: East: Simhadri Banda Tank Garbham, South: Zeroyathi dry land of defendant, West: Zeroyathi dry land of Pinninti Kurmayya, North: Zeroythi dry land of Jinnam Appalanaidu.

DHR Value: Rs. 15,19,606/-; Amin Value: Rs. 19,00,000/-;
JDR Value: విలువ ఇవ్వలేదు, Market Value: Per Acre Rs.9,00,000/-.

ఇంకను భోగట్టా కావలసిన వారు DHR లాయరు గారిని సంప్రదించవచ్చు.

DHAVALA VENKATA RAO
ADVOCATE & NOTARY, Vizianagaram. Ph: 9440194894

ట్రాఫిక్ కష్టాలు



బొబ్బిలి, న్యూస్‌టుడే: పారాది కాజ్‌వే మీదుగా రాకపోకలు మళ్లీ నిలిచిపోవడంతో పట్టణ రహదారులు రద్దీగా మారాయి. గురువారం ఉదయం రాజా కళాశాల రహదారిలో వాహనాలు బారులు తీరాయి. సుమారు గంట సేపు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు కొన్ని ఆర్టీసీ బస్సులను ఆసుపత్రి రహదారి మీదుగా మళ్లించారు. కళాశాలల విద్యార్థులు ఆపసోపాలు పడ్డారు.

విజయనగరం

●విజయనగరం ●నెల్లిమర్ల ● ఎస్.కోట

స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగమవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య



సీతారాంపురంలో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు

విజయనగరం పట్టణం, ఎస్.కోట, వేపాడ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పిలుపునిచ్చారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం 37వ డివిజన్ బీసీ కాలనీ, పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. స్వర్ణాంధ్రప్రదేశ్ @ 2047లో ప్రజలంతా భాగమవ్వాలన్నారు. ఏసీ తిరుమలరావు, ప్రత్యేకాధికారి రోజా వెంకటలక్ష్మి, ఈఈ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు మురళీ యుడు, నరసింగరావు పాల్గొన్నారు. ● ఎస్.కోట మండలం సీతారాంపురంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎంపీపీ సోమేశ్వరరావు, జనసేన నాయకులు కలిసి ఇంటింటా స్టిక్కర్లు అంటించారు. వేపాడ మండలం ఓబలయ్యపాలెంలో సర్పంచి లక్ష్మి, అప్పలనాయుడు, ఎంఈవో భాస్కరరావు గోడపత్రికలు ఆవిష్కరించారు.

అప్రమత్తత అవసరం



ముకుందపురంలో మొక్కలు నాటుతున్న నోడల్ అధికారి లక్ష్మీనారాయణ

నెల్లిమర్ల, డెంకాడ, వేపాడ, జామి, న్యూస్‌టుడే: మండలంలో అన్ని గ్రామాల్లో కాలానుగుణ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. గురువారం గ్రామ సందర్శనలో భాగంగా ఆయన మొయిద గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, పశువైద్యశాల పనితీరును పరిశీలించారు. ● డెంకాడ మండలం గొలగాంలో పర్యటించిన ప్రత్యేకాధికారి జయదర్శినికి గ్రామస్థులు తాగునీటి సమస్య వివరించారు. ● వేపాడ మండలం ముకుందపురంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో పట్నాయక్, ఎంఈవో భాస్కరరావు తనిఖీ చేశారు. పిల్లల నైపుణ్యాలపై ఆరా తీశారు. సర్పంచి కనకరాజు పాల్గొన్నారు. ● జామి మండలం విజినిగిరిలో సర్పంచి సూర్యారావు అధ్యక్షతన ప్రత్యేకాధికారి రామగోపాల్, ఎంపీడీవో సరోజ్, తహసీల్దారు కృష్ణలత గ్రామసభ నిర్వహించారు. అంగన్‌వాడీ, జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాలు పరిశీలించారు. ● ఎల్.కోట మండలం కొత్తపేటలో ఎంపీడీవో కె.రాజేష్, ఈవోపీఆర్డీ జ్ఞానేశ్వరరావు పాల్గొని అంగన్‌వాడీ, పాఠశాలలు పరిశీలించారు.

జేఎన్‌టీయూలో రక్తదానం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. 82 మంది విద్యార్థుల నుంచి రక్తం సేకరించినట్లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి అధికారులు తెలిపారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, కళాశాల ప్రధానాచార్యుడు ఆర్.రాజేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శ్రీనివాసులు, ధర్మారావు పాల్గొన్నారు.

భవిష్యత్తును కాపాడుదాం

విజయనగరం అర్బన్: మాదక ద్రవ్యాలను నియంత్రిద్దాం.. భవిష్యత్తును కాపాడుదాం పేరుతో నగరంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు గురువారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. తోటపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వద్ద నృత్యాలతో అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విజయనగరం పట్టణం: నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తోటపాలెం, బాలాజీనగర్, లంకవీధి, దాసన్నపేట, రాజీవ్‌నగర్ కాలనీ, జొన్నగుడ్డి, పిన వేమలి, రాకోడు, కోరుకొండ, కోరుకొండపాలెం, అట్టాడ, వీజీపురం, డైట్ కళాశాల, ఉడాకాలనీ ఫేజ్-2 ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ త్రినాథరావు తెలిపారు.

కుళాయి రావాలి.. గొంతు తడవాలి

- తాగునీరు అందజేతకు నగరపాలిక చర్యలు
- ఇప్పటికే కీలక తీర్మానాలకు ఆమోదం

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ ప్రజలను ఏళ్లుగా తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఏ కాలమైనా రోజు విడిచి రోజు మాత్రమే సరఫరా సాగుతోంది. అయినప్పటికీ కొన్నిచోట్ల రోజుల తరబడి కుళాయిలు పనిచేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి. వందేళ్ల నాటి పథకాలు ఉండడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. మరోవైపు వైకాపా హయాంలో కొత్త కుళాయిల మంజూరును రాజకీయం చేయడంతో అవస్థలు తీవ్రమయ్యాయి. కూటమి అధికారంలోకి రావడంతో సమస్య పరిష్కారానికి అధికారులు దృష్టిసారించారు. ఇప్పటికే సర్వే పూర్తిచేసి, అవసరమైన ఇళ్లకు పైపులైన్లు వేయనున్నారు. అందులో భాగంగా బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పనులకు పచ్చజెండా ఊపారు.



జొన్నగుడ్డి అంబేడ్కర్ భవనం ప్రాంతంలో నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

ఎదురవుతున్న సమస్యలివీ..

❖ వర్షాలు పడితే రంగుమారిన నీరు వస్తోందని నగరవాసులు గగ్గోలు పెడుతున్నారు ❖ కొన్ని నాలుగైదు రోజులకోసారి అందిస్తున్నారని చెబుతున్నారు ❖ ఉడాకాలనీ ఫేజ్- 1, ఫేజ్-2లోని రిజర్వాయరు మెట్లు పాడై పదేళ్లవుతున్నా సమస్య పరిష్కారం కాలేదు ❖ మురుగు కాలువల్లో పైపులైన్లు ఉండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది

ఆ పన్నులన్నీ రద్దు..

నగరంలోని 61 సచివాలయాల పరిధిలో ఉన్న సౌకర్యాల కల్పన కార్యదర్శులు ఇటీవల ప్రత్యేక పరిశీలన చేశారు. అందులో భాగంగా నీరు రాకుండా 845 కుళాయిలు పనిచేస్తున్నట్లు గుర్తించారు. వాటి డిమాండు రూ.87.57 లక్షలు ఉండగా.. త్వరలోనే ఆ పన్ను బకాయిలను రద్దు చేయనున్నారు ❖ కొన్ని ప్రాంతాల్లో ఇంటర్ కనెక్షన్లు లేని కారణంగా నీరు రాని పరిస్థితి ఉంది. ఇలాంటివి 363 ఉన్నాయి ❖ కనెక్షన్లు ఉండి, పన్ను పరిధిలో లేనివి 1199 ఉన్నట్లు గుర్తించారు. వీటన్నింటినీ మరోసారి క్రమబద్ధీకరించనున్నారు.

మంజూరు ఇలా..

కుళాయిల కోసం ప్రజలు చేసుకునే దరఖాస్తులను తొలుత విద్యా కార్యదర్శి పరిశీలించారు. అనంతరం సౌకర్యాల కల్పన కార్యదర్శి, డీఈఈ, ఈఈ, కమిషనర్ ఆమోదం లభించాలి. తదుపరి ఫిట్టరు ద్వారా వ్యయ అంచనా వేసిన ప్రకారం లబ్ధిదారే సామగ్రి లబ్ధిదారు కొనుగోలు చేస్తే అవసరం మేరకు రూ.200, రూ.6 వేల కుళాయిలు వేస్తామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. రంగుమారిన నీరు రాకుండా తాగునీటి పథకాలను శుభ్రం చేస్తున్నామన్నారు. ఊటబావుల వద్ద బురద లేకుండా చూస్తామని చెప్పారు.

నగరంలో పరిస్థితి ఇదీ..	ఇళ్ల సముదాయాలు: 79,873	నీరందుతున్న గృహాలు: 33,214	అన్ని రకాల కుళాయిలు: 27,264	రూ.200లవి: 9,564	ఏపీఎండీపీ కింద వేసినవి: 4,200	రూ.6 వేల విలువైనవి: 900	రోజూ ఇవ్వాల్సిన నీరు: 48	ఎంఎల్‌డీ ప్రస్తుతం అందుతోంది: 26 ఎంఎల్‌డీ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

?: కామాక్షినగర్ గణేష్ కోవెల, జొన్నగుడ్డిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. - **ప్రసాద్, వై.సూర్యనారాయణ**

● కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. - **రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టరు**

?: లంకాపట్నం రోడ్డు లోని పౌలీ పందులు తిరుగుతున్నాయి. - **పి.కుసుమ, స్థానికురాలు**

● నివారణకు చర్యలు తీసుకుంటాం. - **సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి**

?: రాజుగారి షెడ్ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. - **వై.సూర్యనారాయణ, స్థానికుడు**

● సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. - **ఎస్.అప్పారావు, డీఈఈ, నగర పాలక సంస్థ విజయనగరం పట్టణం**

?: సవరవిల్లి నుంచి మోపాడకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లకొమ్మలు తొలగించాలి. - **రమణబాబు, స్థానికుడు**

● తక్షణమే పరిశీలించి తొలగించే చర్యలు తీసుకుంటాం. - **విపిన్, కార్యదర్శి, సవరవిల్లి**

– న్యూస్‌టుడే, భోగాపురం

జగ్గయ్యపేటలో పరిశుభ్రత పనులు



స్పందనకు వందనం

మండలంలోని జగ్గయ్యపేటలో శుభ్రత పనులను అధికారులు ఎట్టకేలకు చేపట్టారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో ఈనెల 23న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన మురుగు, రహదారులు, పాఠశాల సమీపంలో చెత్త కుప్పలు తొలగించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాల తనిఖీలు చేపట్టారు. రోగులకు మందులు ఇచ్చారు. తాగునీటి ట్యాంకుల్లో నీటిని పరీక్షించి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. – న్యూస్‌టుడే, భోగాపురం

కర్షకుడికి సత్కారం



భోగాపురం, న్యూస్‌టుడే: ఇటీవల మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియమితులైన కర్షకుడు బంగార్రాజుకు అమరావతిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గౌరవ సత్కారం లభించింది. పదవి స్వీకరించిన తర్వాత తొలిసారిగా గురువారం వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావును కలిసి కాసేపు మాట్లాడారు. అనంతరం మార్క్‌ఫెడ్ జీఎం శ్రీనివాసరావుతో కలిసి కమిషనర్ ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. రైతులకు అండగా ఉంటూ, వారికి అవసరమైన విత్తనోత్పత్తులను అందజేస్తూ గిట్టుబాటు ధర కల్పించాలన్నదే తన ధ్యేయమని ఈ సందర్భంగా బంగార్రాజు పేర్కొన్నారు.


పర్యావరణంతో మానవాళి మనుగడ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ మానవాళి మనుగడతో ముడిపడి ఉందని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి తేజస్వి కట్టీమని అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యాలయంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా తన తల్లి సంగమ్మ పేరుతో మొక్క నాటారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అందరిలో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు.



మొక్క నాటుతున్న ఉపకులపతి కట్టీమని

యువోత్సాహం



విద్యార్థినుల నృత్యప్రదర్శన

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన 'ఫెస్ట్' కార్యక్రమం యువతలో ఉత్సాహాన్ని నింపింది. ఆనంద గజపతి ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం వార్షికోత్సవ వేడుక చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

నగరంలో పిడుగులు.. ఆగిన విద్యుత్తు సరఫరా

జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో 12 గంటల సమయంలో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. కలెక్టరేట్‌లో భారీ శబ్దాలు రావడంతో ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అదే క్రమంలో విద్యుత్తు సరఫరా ఆగిపోవడంతో అంతా ఒకేచోటుకు చేరుకున్నారు. కొందరు చీకట్లోనే విధులు నిర్వహించారు. భారీగాలులకు విద్యాశాఖ కార్యాలయ ప్రవేశ మార్గం వద్ద బోర్డు ఒకరి తలపై పడడంతో గాయాలయ్యాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్



పడిపోయిన బోర్డును తీసుకొస్తున్న సిబ్బంది, విద్యాశాఖ కార్యాలయంలో అలుముకున్న చీకట్లు

మత్తుతో జీవితాలు చిత్తు



ఫిర్యాదు పెట్టెను ప్రారంభిస్తున్న సీఐ నారాయణమూర్తి

ఎస్.కోట, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని సీఐ వి.నారాయణమూర్తి అన్నారు. గురువారం పట్టణంలో చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల దుష్పరిణామాలు, ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ, ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయించారు. ఎస్ఐ గంగరాజు, ప్రిన్సిపాళ్లు సూర్యారావు, సునీల్ కుమార్ పాల్గొన్నారు. ❖ సతివాడ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు పోక్సో, మాదక ద్రవ్యాల వినియోగం చట్టాలపై ఎస్ఐ గణేష్ అవగాహన కల్పించారు.

మరుభూమి ఏడిపిస్తోంది!

కొత్తవలస వాటికలో కానరాని కనీస సదుపాయాలు



ట్యాంకరుతో నీరు తెచ్చుకుని పట్టుకుంటున్న దృశ్యం

కొత్తవలస, న్యూస్‌టుడే: అసలే అయినవారు దూరమై పుట్టెడు దుఃఖంలో ఉంటూ అంత్యక్రియల నిర్వహణకు వెళ్లే వారికి మరుభూమిలోని వసతుల లేమి మరింత కన్నీరు పెట్టిస్తోంది. కొత్తవలసలో పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న శ్మశానవాటిక దుస్థితి చూస్తే ఎవరికైనా ఆవేదన కలగక మానదు.

పట్టణంలోని రుద్రభూమిలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. మొత్తం తుప్పలతో నిండిపోయింది. అడుగు వేయలేని పరిస్థితి. మృతదేహాలను పాన్పు చేయడానికి స్థలాన్ని వెతుక్కుంటున్నారు. గతంలో నిర్మించిన బర్నింగ్ షెడ్ ఉపయోగకరంగా లేదు. దీంతో ఆరుబయటే దహన సంస్కారాలు చేస్తున్నారు. స్నానాలు చేయడానికి, కార్యక్రమాలు నిర్వహించడానికి నీటి సదుపాయం లేదు. ఉన్న చేతిపంపు మరమ్మతుకు గురైంది. సర్పంచిగా గొరపల్లి అలేఖ్య హయాంలో ఏర్పాటు చేసిన కుళాయిలు కనిపించడం లేదు. దీంతో దాతల సహకారంతో ట్యాంకరుతో నీరు తెప్పించుకుని కార్యక్రమాలు పూర్తి చేస్తున్నారు. శ్మశానవాటికను ఆనుకుని ఉన్న సులభ్ కాంప్లెక్సు నీటి ట్యాంకు నుంచి ప్రహరీకి కుళాయిలు ఏర్పాటుచేసి నీరు సరఫరా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు. గేట్లు తెరిచే ఉంచేయడంతో కొందరు బహిర్భూమిగా వాడుకుంటున్నారు.



పనిచేయని చేతిపంపు

ప్రతిపాదనలు చేశాం..

కంటకాపల్లిలోని శారడ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల నుంచి శ్మశానాన్ని బాగుచేయడానికి ముందుకొచ్చింది. ఉపాధి నిధులతోనూ బాగు చేయడానికి ప్రతిపాదించాం. ప్రహరీకి కుళాయిలు బిగించి సులభ్ కాంప్లెక్సు నీటి ట్యాంకు నుంచి నీరందించే ఏర్పాటు చేస్తాం. తుప్పలు తొలగిస్తాం. – ఎం.ఎర్రయ్య రామస్వామి, సర్పంచి, కొత్తవలస

మరో విద్యార్థినికి అస్వస్థత / ఏడుగురు డిశ్చార్జి



ఆసుపత్రిలో విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్.కోట, న్యూస్‌టుడే: ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహానికి చెందిన మరో బాలిక అస్వస్థతకు గురవడంతో బుధవారం అర్ధరాత్రి విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. దీంతో బాధితుల సంఖ్య 18కి చేరింది. ఎస్.కోట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో మంగళవారం నలుగురు, గురువారం ఏడుగురు డిశ్చార్జి అయ్యారు. కేంద్రాసుపత్రిలో ఇద్దరు, ఎస్.కోటలో ముగ్గురు వైద్యం అందుకుంటున్నారు. వసతిగృహం నుంచి మిగిలిన వారంతా ఇళ్లకు వెళ్లిపోయారు.

వసతి గృహం పరిశీలన.. ఈ వసతిగృహాన్ని జిల్లా ఆహార భద్రత అధికారి నౌరోజీ బుధవారం రాత్రి సందర్శించారు. సరకుల నిల్వలు తనిఖీ చేశారు. విద్యార్థినులు తీసుకున్న ఆహారంపై సంక్షేమాధికారి విజయనిర్మల వివరణ తీసుకున్నారు. నీటి శుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థినులను ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం కలిసి మాట్లాడారు. అనంతరం ఆ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి కె.రమేష్, జిల్లా గర్ల్స్ కోకన్వీనరు భారతి, జిల్లా కమిటీ సభ్యురాలు ఎ.అను వసతిగృహాన్ని పరిశీలించి మాట్లాడారు.

బయటి ఆహారం తినడం వల్లే: డీఎంహెచ్‌వో

ఎస్.కోట: వసతిగృహ విద్యార్థినులు బయటి ఆహారం తినడం వల్లే సాధారణ డయేరియా లక్షణాలు కనిపించాయని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఓ ప్రకటనలో తెలిపారు. అనారోగ్యానికి గురైన 17 మందిని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది చికిత్స అందించి, అనంతరం దగ్గరుండి ఆసుపత్రులకు తరలించామన్నారు. వసతిగృహ నిర్వహణలో పారిశుద్ధ్య లోపం, కొందరు విద్యార్థులు ఆదివారం బయట ఆహారం తీసుకోవడం వల్లే ఈ పరిస్థితికి కారణంగా గుర్తించామన్నారు. నీటి నమూనాలు సేకరించామన్నారు.

సీతారాముల శాంతి కల్యాణం



విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం రామనారాయణంలో గురువారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. భక్తులు పూజలు చేసి రామభజన చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు నారాయణం సీతారామయ్య, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



చెక్కు అందజేస్తున్న సత్యనారాయణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జల వనరులశాఖ విశ్రాంత ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ఎల్.ఆర్.సత్యనారాయణ విజయవాడ వరద బాధితులకు రూ.20 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో గురువారం కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు.

'ఎండీఎం వ్యవస్థ రద్దు చేయాలి'

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎండీఎం వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరామని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కొణదం శంకరరావు అన్నారు. బుధవారం విజయవాడలో జరిగిన ఆలిండియా రేషన్ డీలర్ల సంక్షేమ సమాఖ్య సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో పలు సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీలర్లకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.18,500, పట్టణ ప్రాంతాల్లో రూ.24,500 గౌరవ వేతనంతో కూడిన కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌రెడ్డి సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండు

విజయనగరం అయ్యన్నపేట: ఆర్టీసీ పొరుగు సేవల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఒప్పంద, పొరుగుసేవల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండు చేశారు. విజయనగరం ఎల్బీజీ భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తున్న వారికి రూ.26 వేతనం అందించాలని కోరారు.

అక్టోబరు 1 నుంచి జనజాతి సమ్మేళనం

విజయనగరం విద్యావిభాగం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు(ఏబీవీపీ) ఆధ్వర్యంలో అక్టోబరు 1, 2వ తేదీల్లో జనజాతి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్ తెలిపారు. సమ్మేళన

సంక్షిప్త సమాచారం

గోడప్రతులను గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎస్.డి.అనిత చేతుల మీదుగా ఆవిష్కరించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులంతా నిత్యం మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మిమ్స్ ఆసుపత్రి వైద్యుడు సుధాకర్ సూచించారు. గురువారం నెల్లిమర్ల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు టి.శశికుమార్, ఆదిలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, పీవోలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

కొత్తవలస: ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కుమారి మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందడంతో ఎస్ఎంసీ తరఫున ఛైర్మన్ రాము, వైస్ ఛైర్మన్ బంగారు పాప, మాజీ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

భోగాపురం, న్యూస్‌టుడే: గూడెపువలస నుంచి ఎ.రావివలస వెళ్లే ప్రధాన రహదారిలో గురువారం లారీ బోల్తా పడింది. రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు పూర్తిగా పాడవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వాహన చోదకుడు, క్లీనర్ స్వల్ప గాయాలతోనే బయటపడినట్లు పోలీసులు చెబుతున్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఏడీ జగదీశ్

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: దివ్యాంగులు, కుష్ఠు వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారు అన్ని రంగాల్లో రాణించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా ఏడీ జగదీశ్ అన్నారు. లెప్రసీ మిషన్ ఏర్పాటై 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా హీల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హీల్ ప్రాజెక్టు సమన్వయకర్త కిస్మత్ నందా, తాలాడ దీప్తి మాట్లాడుతూ ఆర్థికంగా ఎదిగేందుకు చేతివృత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అర్చన, అచ్చిరెడ్డి, కొండబాబు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చర్చించండి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ప్రగతి సాధించాలంటే ప్రత్యేక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. గురువారం విజయనగరంలోని జడ్పీ అతిథిగృహంలో మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌తో చర్చించాలని కోరారు. ఉత్తరాంధ్రలో పరిశ్రమలు లేక ఉపాధి అవకాశాలు లేకుండా పోవడంతో యువత ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. సుజల స్రవంతిని త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు.



కొణతాలకు వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ

అన్నదాతలను ఆదుకోండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో అన్నదాతలను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పైడిపినాయుడు కోరారు. గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని, అన్ని పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని, సహకార రంగంలో ఉన్న భీమసింగి చక్కెర పరిశ్రమకు నిధులిచ్చి ఆధునికీకరించాలని కోరారు. నాయకులు రాకోటి రాములు, గంగునాయుడు, నాగేశ్వరరావు, సూరిదేవుడు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: 24, 25 తేదీల్లో నెల్లిమర్ల ఫుట్‌బాల్ క్రీడామైదానంలో నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న కొండవెలగాడ ఉన్నత పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు జిల్లా, నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ప్రిన్సిపల్ జానశంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రారంభం... ఎస్.కోట: పట్టణంలో కేంబ్రిడ్జి-నారాయణ పాఠశాలలో మండల స్థాయి బాలుర స్కూల్‌గేమ్స్‌ను ఎంఈవో పి.గణపతిలక్ష్మి ప్రారంభించారు. కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 280 మంది పాల్గొన్నారన్నారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు జానశంకర్